క్లుప్తంగా

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, నేమకల్ గ్రామ రైతులు

అనంతపురం అర్బన్: పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ, రైతు సంఘం నాయకులు, రైతులు ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. బొమ్మనహాళ్ మండలం నేమకల్, హిరిదేహాల్ వద్ద కంకర్ మిషన్లు, స్టీల్ ప్లాంట్లు, పరిశ్రమల ఉంచి వెలువడుతున్న దుమ్ము, దూళితో వాతావరణ కాలుష్యం అవుతోందన్నారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రామకృష్ణ, కుళ్ళాయిస్వామి, నాగార్జున, తిప్పేస్వామి, గురుస్వామి, రైతులు మల్లప్ప, వశికేరప్ప, రామాంజనేయులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

పుస్తకాల గది సీజ్

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపో పక్కన ఉన్న ఏవీఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పుస్తకాల గదిని ఎంఈఓ ఈశ్వరప్ప సోమవారం సీజ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు సురేష్, రాజశేఖర్, సుధీర్, నిఖిల్, తేజ్, భీమేష్, భాస్కర్, సాగర్, పురుషోత్తం, పృథ్వీరాజ్ మాట్లాడారు. ఏవీఆర్ పాఠశాలల్లో అత్యధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



రాకెట్ల పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్యాధికారి వెంకటేష్‌నాయక్

ఉరవకొండ: మొక్కలు విస్తారంగా పెంచితేనే పర్యావరణ రక్షణతో పాటు కాలుష్య నివారణ సాధ్యమని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ తెలిపారు. సోమవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆవరణలో జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ వారి ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

బ్రహ్మసముద్రం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడుకుందామని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ అన్నారు. సోమవారం వన మహోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. డాక్టర్ అబ్తాబ్, సూపర్‌వైజర్ రామలక్ష్మి, పీహెచ్‌ఎన్ మేరీ, ఫార్మసిస్ట్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి టీకా

బెళుగుప్ప: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, జీడిపల్లి గ్రామాల్లో రైతులకు చెందిన పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకా వేసినట్లు పశు వైద్యాధికారి రమేష్ తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో 126 పశువులకు, జీడిపల్లి గ్రామంలో 330 పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు మారుతి, రవికుమార్, ఎర్రిస్వామి, సుదర్శన్ వంశీ పాల్గొన్నారు.

ముద్ద చర్మవ్యాధిని తరిమికొడదాం

గుమ్మఘట్ట: పశువులకు సోకే ముద్దచర్మ వ్యాధిని తరిమికొడదామని పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని అడిగుప్ప,బేలోడు గ్రామాలల్లో 380 పశువులకు ముద్దచర్మవ్యాధి టీకా వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమేష్, లక్ష్మీనారాయణ, మాంతేష్, పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కుందుర్పి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ వనజాఅక్కమ్మ ఎంఈఓ తిప్పేస్వామి తదితరులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అప్పిలేపల్లి ఉన్నత పాఠశాలలో శిశుసంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ, బాలికల విద్య తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, సూపర్‌వైజర్ సుశీల, హెచ్ఎం ధనుంజయ, ఉపాధ్యాయులు జయశ్రీ, జయరాంనాయక్, నళిని, సుగుణ పాల్గొన్నారు.

అర్జీలను పెండింగ్ పెట్టొద్దు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

కళ్యాణదుర్గం: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వెనుక ఎంఆర్‌పీఎస్ ఆత్మగౌరవ జెండా కట్టను ఏర్పాటు చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు బానాసి శీను, దురదకుంట తిమ్మరాజు, వెంకటేశులు, నాగభూషణ ఆర్డీఓను కోరారు.

మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామని తెలిపింది. నియోజకవర్గంలో సుమారు 48,340 మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరందరికీ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి వెంటనే అందించాలి. ఇప్పటివరకూ ఏ ఒక్కరూ దీనిపై నోరు మెదకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా చంద్రబాబు నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెడుతారనే అనుమానం ఉంది.

– షేక్షావలి, కళ్యాణదుర్గం

నిరుద్యోగ భృతిపై స్పష్టతలేదు



గత ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకొస్తే ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చేంత వరకూ రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. కానీ ఇంత వరకూ జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. జాబ్ వచ్చేంత వరకూ భృతి ఇవ్వాలి.

– పద్మరేఖ, కొత్తపల్లి, కంబదూరు మండలం

నిరుద్యోగులను మోసం చేయొద్దు



సీఎం చంద్రబాబు తన సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో నిరు ద్యోగులకు భృతి, దీంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. 2014లో అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా మోసం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. అప్పటి మాదిరిగానే ఇప్పుడు కూడా మోసం చేయకుండా ఇచ్చిన హామీని అమలు చేసి, నిరుద్యోగులు రోడ్డున పడకుండా చూడాలి.

– హనుమంతరెడ్డి, నారాయణపురం గ్రామం, కూడేరు మండలం

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో?




నేను బీఎస్సీ చేశాను. జాబ్ వచ్చే వరకూ చంద్రబాబు నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఆలస్యమైతే ఆ లోపు నిరుద్యోగ భృతి అయినా ప్రభుత్వం ఇస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నాం. నిరుద్యోగ భృతి కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్నాం. చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి నిరుద్యోగులకు భృతి ఇవ్వాలి.

– పి.భరత్‌కుమార్, మాల్యాం, కణేకల్లు

భృతి..అంతా భ్రాంతియేనా?

కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి పేరుతో కుచ్చుటోపీ పెట్టేందుకు సిద్ధమైంది. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలతో పాటు చదువుకున్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినా ఇప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, నిరుద్యోగ భృతిపై ఎలాంటి ఊసే లేదు. దీంతో నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం చేసిన హామీలపై మండిపడుతున్నారు.

– కళ్యాణదుర్గం/ఉరవకొండ/రాయదుర్గం:



నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఉత్తిదేనా?..

గతంలో కూడా చంద్రబాబు నాయుడు ఇంటింకో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ నిరుద్యోగులను నట్టేట ముంచారు. ఈ సారి కూటమితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చంద్రబాబు ఈ సారి మేనిఫెస్టోలో కూడా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఏకంగా సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా మొదటి ప్రాధాన్యతగా యువతకు పెద్ద పీట వేస్తూ టీడీపీ మేనిఫెస్టో ప్రకటించింది. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పారు. అయితే ఇదంతా ప్రస్తుతం ఉత్తిదేనన్న భ్రమ కలుగుతోందని నిరుద్యోగులు వాపోతున్నారు.

రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా నిరుద్యోగుల కుటుంబాలు, నిరుద్యోగుల సంఖ్య

మండలం	గృహాల సంఖ్య	నిరుద్యోగులు
డీహీరేహాళ్	15,385	10,220
రాయదుర్గం (అర్బన్)	18,927	13,922
కణేకల్లు	21,274	16,822
బొమ్మనహాళ్	18,776	14,192
రాయదుర్గం	14,194	9,892
గుమ్మఘట్ట	17,053	11,698
మొత్తం	1,05,609	76,746

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గృహాల సంఖ్య, నిరుద్యోగుల సంఖ్య ఇలా...:

మండలం	గృహాల సంఖ్య	నిరుద్యోగులు
కళ్యాణదుర్గం	11,384	7,800
కళ్యాణదుర్గం అర్బన్	15,767	10,350
కంబదూరు	13,380	8,830
కుందుర్పి	11,865	7,820
శెట్టూరు	10,630	7,340
బ్రహ్మసముద్రం	9,363	6,200
మొత్తం	72,389	48,340

ఉరవకొండ నియోజకవర్గంలోని ఇళ్లు, నిరుద్యోగుల వివరాలు:

మండలం	గృహాల సంఖ్య	నిరుద్యోగులు
ఉరవకొండ	45,600	19,400
వజ్రకరూరు	17,800	7,800
కూడేరు	13,706	5,900
బెళుగుప్ప	11,200	3,300
విడపనకల్లు	14,500	6,100
మొత్తం	102,806	42,500

నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం కుచ్చుటోపీ

- అధికారంలోకి రాగానే నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ
- ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని భరోసా
- భృతి ఎప్పుడిస్తారోనని నిరుద్యోగుల ఎదురుచూపు


నిరుద్యోగులను ఆదుకోవాలి



మా తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ నన్ను ఎంఏ, డీఈడీ, బీఎల్ఐఎస్సీ వరకూ చదివించారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు నిరుద్యోగలందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తానని, ఉద్యోగం వచ్చేంత వరకూ రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చి నెల రోజులు దాటినా సీఎం గానీ, డిప్యూటీ సీఎంగానీ ఇంత వరకూ జాబ్ క్యాలెండర్‌పై ఊసేలేదు. 2014లో ఇలాగే చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి విస్మరించారు.

– హరికుమార్ నిరుద్యోగి, అండేపల్లి, కంబదూరు మండలం

మాట నిలబెట్టుకోవాలి



ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి అందజేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలి. గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా నిబంధనలతో కొర్రీ పెట్టకుండా అందరికీ నిరుద్యోగ భృతి అందించాలి. ప్రభుత్వం మాట ఇచ్చి నెలరోజులు దాటి పోతున్న ఉద్యోగ కల్పన, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై ప్రస్తావన లేదు. చంద్రబాబు ఇచ్చిన హామీ కోసం రాష్ట్రంలోని కోట్లాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.

– కొట్రేష్, ఏఐవైఎఫ్ నిరుద్యోగ జేఏసీ ప్రధాన కార్యదర్శి రాయదుర్గం

వేయి కళ్లతో ఎదురుస్తున్నా



ఆరేళ్ల క్రితమే డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి ఉద్యోగం లేక ఉపాధి పనులకు, మరోవైపు దినసరి కూలీగా వెళ్తున్నా. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కానీ ఇంత వరకూ ఊసేలేదు. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదు. సీఎం చంద్రబాబు ఉద్యోగాల క్యాలెండర్ విడుదల చేస్తారని నాలాంటి నిరుద్యోగులంతా ఓట్లేసి గెలిపించారు. ఇచ్చిన మాట నిలుపుకోవాలి.

– అనిల్, బొస్తరపల్లి, కుందుర్పి మండలం

భృతి హామీని అమలు చేయాలి



ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన హామీ ఇచ్చారు. లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటైనా ఇంకా స్పష్టత లేదు. ఇప్పటికే వేల సంఖ్యలో వివిధ పోస్టులకు వయస్సు రీత్యా నిరుద్యోగులు అర్హత కోల్పోయే అవకాశం ఉంది.

– ప్రసాద్, తగ్గుపర్తి గ్రామం, బెళుగుప్ప మండలం

ఉద్యోగాలు ఇవ్వాలి



నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలి. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. నెల రోజులు అవుతున్నా ఉద్యోగ కల్పనపై స్పష్టత రాలేదు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై స్పష్టతకు వచ్చి వెంటనే ఉద్యోగ, ఉపాధి కల్పన నిరుద్యోగులకు కల్పించాలి.

– గాజుల తేజ, బీఏ, 4వ వార్డు ఉరవకొండ

జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన ఇవ్వాలి



నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేయాలి. దాని కంటే ముందు పాత నోటిఫికేషన్లు పూర్తి చేయాలి. నిరుద్యోగులకు ఆర్థిక కష్టాలు ఎదరవ్వకముందే ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందించాలి.

– మారుతీప్రసాద్, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నిరుద్యోగ యువతీయువకులకు ప్రభుత్వం భృతి ఇవ్వాలి. కొర్రీలు పెట్టకుండా సక్రమంగా అందించాలి. ప్రభుత్వం ఏర్పాటై నెలన్నర కావొస్తున్నా హామీపై ఊసెత్తడం లేదు. ఎప్పుడిస్తారో అర్థం కావడం లేదు. గతంలా చివర్లో కాకుండా ఈ సారి మొదటి ఏడాది నుంచే ఇవ్వాలి.

– శివరాజ్,నిరుద్యోగి, గలగల, గుమ్మఘట్ట మండలం

నిరాశ మిగిలేలా ఉంది..



ప్రభుత్వం మారింది. ఉద్యోగాలు లేక, నిరుద్యోగ భృతి వస్తుందని ఆశ పడ్డాం. నేను బీటెక్ చదివాను. ప్రస్తుతం కుటుంబం గడవడం, పిల్లల బాగోగులు చూసుకోవడం కష్టంగా ఉంది. ఇప్పటివరకు ఉద్యోగం రాలేదు. వచ్చే మార్గం కనిపించలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదు. ఇస్తారో లేదోకూడా చెప్పడం లేదు.

– స్వర్ణలత, బీటెక్, నిరుద్యోగి, శెట్టూరు

హామీ నిలబెట్టుకోవాలి



నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం హామీని సీఎం చంద్రబాబునాయకుడు, కూటమి నేతలు నిలబెట్టుకోవాలి. రాష్ట్రంలో నిరుద్యోగ యువత భృతి కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా అర్హతే ప్రామాణికంగా భృతి మంజురు చేయాలి. ఎంత మంది నిరుద్యోగులు ఉపాధి దొరక్క ఇతర కూలీ పనులకు వెళుతున్నారు.

– చిన్నమాదుల సిద్ధప్ప, పీసీపీ కొత్తకోట గ్రామం, వజ్రకరూరు మండలం

కొలువు తీరిన పీర్లదేవుళ్లు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, హావళిగి, కరకముక్కల, గడేకల్లు,పెద్ద కొట్టాలపల్లి, పాలికి తదితర గ్రామాల్లో సోమవారం పీర్ల దేవుళ్ల పీర్ల చావడిలో కొలువు తీరాయి.

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామంలో పీర్ల పండుగ పెద్ద ఎత్తున నిర్వహించారు. సోమవారం పీర్లను చావిడిలో ప్రతిష్టించారు. నేడు మంగళవారం చిన్న సరిగెత్తు, గురువారం పెద్ద సరిగెత్తు, శుక్రవారం జలధి ఉంటుంది.


కంబదూరు:మండలంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. మండలంలోని కంబదూరు, నూతిమడుగు, కర్తనపర్తి, తిమ్మాపురం, గుద్దెళ్ల గ్రామాల్లోని పీర్లు కొలువుదీరాయి.

లాలుస్వామి పీర్లకు వెండి మల్లెలహారం

ఉరవకొండ: పట్టణంలోని 4వ వార్డులో వెలసిన లాలుస్వామి పీర్లకు రూ.6 లక్షల విలువ చేసే వెండి హారాన్ని భక్తులు బహూకరించారు. పీర్లచావిడి ప్రధాన స్వాములైన హెచ్‌కే గౌస్ ఆధ్వర్యంలో 5 కేజీల బరువు ఉన్న వెండి మల్లెల హారాన్ని పట్టణ పురవీధుల్లో భక్తులు ఊరేగిస్తూ, స్వామికి సమర్పించారు. అనంతరం లాలుస్వామి పీర్లను వెండి హారంతో ముస్తాబు చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు మొహర్రం పెద్ద సరిగెత్తు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఉచ్చుబాయి, గొందిబావిలోని పెద్దపీర్లు, బళ్లారి రోడ్డులోని చమ్మా మకాన్, ఆత్మకూరు వీధిలోని నింబూసా, లడ్డు పీర్ల మకాన్ తదితర ప్రాంతాల్లోని పీర్ల చావిడిలో సోమవారం ఫాతేహాలు నిర్వహించారు. మొహర్రం వేడుకల్లో చివరి రోజు బుధవారం పట్టణంలోని కోటలో పీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమాలు ఉంటాయి.



ఉరవకొండలో లాలూస్వామిని వెండిహారంతో అలంకరించిన దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు నిర్వహించారు. వన్నూరస్వామి పీర్ల చావడి వద్ద పెద్ద సరిగెత్తు వేడుకలు జరిపారు. పీర్లస్వాములకు చెక్కర చదివింపులు, పానకాలతో భక్తులు స్వామి మాలలు ధరించి, పూజలు చేశారు. బెళుగుప్పలో మంగళవారం తెల్లవారుజామున పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం జలధితో మొహర్రం వేడుకలు పూర్తవుతాయని ముజావర్లు తెలిపారు.

వేలంలో రూ.4.94 లక్షల ఆదాయం

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలం మురడి ఆంజనేయస్వామి ఆలయం ముందు నారీకేళి విక్రయం, టెంకాయ చిప్పల కోసం మంగళవారం జరిగిన వేలంలో రూ.4.94 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. 11 మంది పాటదారులు పాల్గొనగా, రామాంజనేయులు అనే వ్యక్తి రూ.3.83 లక్షలకు దక్కించుకున్నారు. జయరాం అనే వ్యక్తి టెంకాయల హక్కు రూ.1.11 లక్షలకు సొంతం చేసుకున్నారు. దేవదాయశాఖ అధికారి జితేంద్ర, అటెండర్ రామాంజనేయులు, సర్పంచ్ గంగప్ప పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం వారపు సంత వేలం పాట నిర్వహించారు. ఈఓపీఆర్డీ దాస్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన పి. ప్రశాంత్ అనే వ్యక్తి వారపు సంత సుంకం వసూలు హక్కులు రూ.1.5 లక్షలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫక్రుద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటా సర్వే

రాయదుర్గం: కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డివిజన్ లెప్రసీ (డీపీఎం) అధికారి హెచ్.నీలకంఠ సూచించారు. సోమవారం మండలంలోని ఆవులదట్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి మాధవమోహన్‌తో కలిసి ఏఎన్ఎం, ఎమ్ఎల్‌హెచ్‌పీ, ఆశాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టు వ్యాధి నివారణపై ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధిపై అపోహలు తొలగించి, 2030 నాటికి వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఎంపీహెచ్ఎస్ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల డ్రిప్ పరికరాలు చోరీ

ఉరవకొండ: వజ్రకరూరు మండలం గుళ్యాలం గ్రామంలో రైతు గాజుల లాలుకు చెందిన డ్రిప్ వైరును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రూ.1.50లక్షల విలువజేసే దాదాపు 110 కట్టల డ్రిప్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీనిపై ఏఎస్ఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు.

మహిళకు తీవ్ర గాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బీటీపీ రోడ్డు శివాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యశోదమ్మ అనే మహిళకు సోమవారం తీవ్రగాయాలయ్యాయి. అగ్రహారం ఆనందప్ప భార్య యశోదమ్మ నడిచి వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొనింది. ఈ ప్రమాదంలో యశోదమ్మ ఎడమకాలుకు తీవ్ర రక్తగాయమైంది.

కళ్యాణదుర్గం రూరల్: శెట్టూరు మండలం బొచ్చుపల్లికి చెందిన శ్యామలమ్మను గరుడాపురం వద్ద ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈప్రమాదంలో శ్యామలమ్మ కుడి కాలు విరిగింది. వెంటనే స్థానికులు ఆమెను సీహెచ్‌సీకి తరలించారు.

కూడేరు: మండల పరిధిలోని లెప్రసీ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన సతీష్ గాయపడ్డాడు. సతీష్ ద్విచక్ర వాహనంపై ఉరవకొండ నుంచి తిరిగి వస్తూ, అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు.

ఉపాధి హామీ చట్టంపై అవగాహన అవసరం

కూడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం పట్ల కూలీలు, రైతులు అవగాహన కలిగి ఉండాలని సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం కమ్మూరులో సామాజిక తనిఖీ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ రంగారెడ్డి, పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం..విద్యార్థులకు కష్టాలు

కంబదూరు: నూతిమడుగు ఏపీఆర్ఎస్ బాలుర గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని ఎస్సీ,ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు డాబా రమేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. సోమవారం వారు పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు.జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలలో నెలకొన్న సమస్యలు తీర్చాలని వారు కోరారు.